గర్భిణులకు స్కానింగ్ కష్టాలు

- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో లేని స్కానింగ్ సౌకర్యం
- పెరిగిన డెలివరీలు, ఓపీ సంఖ్య
- ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయిస్తున్న వైనం
- ఆర్థికంగా నష్టపోతున్నామని రోగుల ఆవేదన



ఓపీ విభాగం వద్ద క్యూలో నిల్చున్న మహిళలు, ఇతర రోగులు

మిర్యాలగూడ అర్బన్: డివిజన్ పరిధిలో అతి పెద్దదైన మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం లేకుండా పోయింది. దీంతో ఈ ఆస్పత్రికి వచ్చే గర్భిణులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించడంతో పాటు వైద్యుల సంఖ్యను పెంచింది. మరోవైపు కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తూ ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన వారికి నగదు పారితోషికం ఇస్తుండటంతో రోగుల తాకిడి పెరిగింది. గతంలో రోజూ 50కిపైగా మాత్రమే గర్భిణులు పరీక్షల కోసం వచ్చేవారు. కాని ఇప్పుడు 150కి పైగా వస్తున్నారు. గర్భిణుల సంఖ్యకు అనుగుణంగా నలుగురు గైనకాలజిస్టులను నియమించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నా స్కానింగ్ సౌకర్యం లేక ఇక్కట్లు తప్పడం లేదు.

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల వైపు..

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రతి గర్భిణికి వైద్యుల సలహాలు, సూచనలు ఇస్తూ నెలలు నిండే వరకు కనీసం మూడుసార్లు స్కానింగ్ తీయాల్సి ఉంటుంది. బిడ్డ ఎదుగుదల గురించి వైద్యులు ఎప్పటికప్పుడు తెలుసుకుని మందులు అందిస్తారు. ఆరు నెలలు నిండిన తరువాత టిఫా స్కానింగ్ చేసి బిడ్డ అవయవాలు, పనితీరు పరిశీలిస్తారు. అయితే ఏరియా ఆస్పత్రిలో స్కానింగ్ సౌకర్యం లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో గర్భిణి కేవలం స్కానింగ్ కోసమే రూ.5 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ తీస్తే తమకు ఈ ఖర్చు ఉండదని గర్భిణులు అంటున్నారు.

రోజుకు 60 మందికి పైగా స్కానింగ్ !

కాగా ఏరియా ఆస్పత్రికి వచ్చే గర్భిణుల్లో దాదాపు 60మందికి పైగా స్కానింగ్ చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారని తెలిసింది. దీంతో వారంతా వైద్యులు సూచించిన స్థానిక ప్రైవేట్ సెంటర్లలో స్కానింగ్ చేయించుకుంటున్నారు. అయితే ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్టులు మాత్రం సదరు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లతో కుమ్మక్కై ఆయా సెంటర్లలోనే స్కానింగ్ చేయింసుకోవాలని పంపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఏరియా ఆస్పత్రిలో స్కానింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రిలో గతేడాది జరిగిన కాన్పులు ఇలా..

జనవరి	75	మే	137	సెప్టెంబర్	160
ఫిబ్రవరి	76	జూన్	144	అక్టోబర్	165
మార్చి	122	జూలై	119	నవంబర్	165
ఏప్రిల్	135	ఆగస్టు	151	డిసెంబర్	131
				జనవరి(2023)	106

ఆస్పత్రిలోనే స్కానింగ్ తీయాలి



ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకునే స్థోమత లేకనే పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెపుతున్నా ఏరియా ఆస్పత్రిలో మాత్రం స్కానింగ్ తీయకపోవడం దారుణం. ఉచితంగా స్కానింగ్ తీయాలి.

– బంటు కవిత, మిర్యాలగూడ

ఉన్నతాధికారులకు నివేదించాం



ఏరియా ఆస్పత్రిలో స్కానింగ్ సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఆస్పత్రికి వచ్చే సాధారణ రోగులతో పాటు గర్భిణుల సంఖ్య పెరిగింది. అందుకు అనుగుణంగా మెరుగైన వైద్యం అందిచేందుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే స్కానింగ్ ఏర్పాటు చేస్తారని భావిస్తున్నాం.

– డాక్టర్ శ్రీనివాస సమరథ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

వేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : మండలంలోని మారేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, దేవాలయ చైర్మన్ గడిద శ్రీకాంత్, సర్పంచ్‌లు గుండెబోయిన వెంకన్న, వెంకట్‌రెడ్డి, రాములు, నరేందర్ రావు, రవీందర్‌రెడ్డి, నాగరాజు, వెంకట్‌రెడ్డి, సైదులు, ఆలయ ఈఓ అంబటి నాగిరెడ్డి, ఉప సర్పంచ్ ఏడు కొండలు, గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి వెంకన్న, ఆలయ పూజారి శేషాచార్యులు తదితరులు ఉన్నారు.

మాచనపల్లిలో ఎస్సీ, బీసీ కులస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్సీ, బీసీ కులస్తులు

మిర్యాలగూడ : మాడ్గులపల్లి మండలంలోని మాచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా చేపట్టిన హోమం ఎదుట బుధవారం గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. హోమంలో ఎస్సీ, బీసీలు ఎందుకు పాల్గొనకూడదని అగ్రకులాల వారిని ప్రశ్నించారు. దీంతో స్థానిక సర్పంచ్ జూలకంటి పద్మ జోక్యం చేసుకుని హోమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో హోమం పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

కిశోర బాలికలకు ఉచిత శిక్షణ

హాలియా: దుర్గాబాయి మహిళా శిశు వికాస్ కేంద్రం నల్లగొండ సౌజన్యంతో కిశోర బాలికలకు అనుముల మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో హాలియాలో బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీడీపీఓ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14–18 సంవత్సరాల వయస్సు కలిగి, 8వ తరగతి వరకు చదివిన కిశోర్ బాలికలు అర్హులని, టైలరింగ్ కోర్సులో 25 మందికి 45 రోజులు, బ్యూటీషియన్ కోర్సులో 25 మందికి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలికలు పూర్తి వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే బాలునాయక్



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్న బాలునాయక్, పార్టీ శ్రేణులు

చందంపేట : రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్దేవర్‌పల్లి గ్రామంలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. తెల్దేవర్‌పల్లి, పాత తెల్దేవర్‌పల్లి, నక్కలగండితండా గ్రామాల మీదుగా పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ కేతావత్ బీల్యానాయక్, జగన్‌లాల్‌నాయక్, కిషన్ నాయక్, చందంపేట ఎంపీపీ పార్వతిచందు నాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, కొండమల్లేపల్లి ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి, ముక్కమల వెంకటయ్య, ఏపీ.రెడ్డి, వేణుధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, లోకసాని కృష్ణయ్య, కోఆప్షన్‌మెంబర్ సాధిక్, ససర్పంచులు రంగయ్య, బాలోజీ, ఎంపీటీసీ నోముల మల్లయ్య, ఎలిజర్ల వెంకులు, గుద్దేటి శ్రీధర్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష విడనాడాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత

పెద్దవూర: ఆడపిల్లలపై చూపుతున్న వివక్షను విడనాడాలని, మగపిల్లలతో సమానంగా చూడాలని జేఎన్‌వీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. బుధవారం పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు సామాజిక అంశాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందినా మారుమూల గిరిజన తండాలు, ప్రాంతాల్లో భ్రూణ హత్యలు, శిశు విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు నిత్యం ఎక్కడో ఒక దగ్గర కొనసాగుతుండడం విచారకరమని అన్నారు. ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతున్నట్లు పేర్కొన్నారు. బాలిక సంరక్షణకు, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. ఆడపిల్లలు ఆత్మస్థైర్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయం అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలో వెంకటాద్రిపాలెం గ్రామ శివారు పరిధిలో జడ్చర్ల రహదారిపై రూరల్ ఎస్ఐ దోరపల్లి నరసింహులు ఆధ్వర్యంలో బుధవారం నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలపై సంచరిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు చేసి 20 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఉమాపతి రావు, గౌరి శంకర్, దస్రూ నాయక్, చిన్నప్పలు తదితరులు ఉన్నారు.

జీపీ సిబ్బంది పాదయాత్రను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలో ఈనెల 12న గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ కోరారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలో వెట్టిచాకిరి చేయించుకుంటున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు వాడపల్లి శ్రీరాములు, మహమ్మద్ జహీర్, మండల ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, సీఐటీయూ సహాయ మండల కార్యదర్శి సుబాని పాల్గొన్నారు.

నలుగురికి జరిమానా

మిర్యాలగూడ టౌన్ : హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో నలుగురికి రూ. మూడు వేల చొప్పొన జరిమానా విధిస్తూ రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి బుధవారం తీర్పు నిచ్చారు. వివరాల్లోకి వెళితే...దామరచర్ల మండల కేంద్రంలో 2017 ఆగస్టు 3వ తేదీన ఓ వ్యక్తి డబ్బులు ఇవ్వడం లేదంటూ అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై కొంత మంది యువకులు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న వాడపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తాళ్లపల్లి సత్యనారాయణతో పాటు కానిస్టేబుళ్లు గోపి, శ్రీనివాస్ కలిసి ఆందోళన వద్దకు చేరుకున్నారు. ఆందోళనను విరమించాలని కోరుతున్న సమయంలో ఆగ్రహించిన జేత్రాంతండాకు చెందిన రమావత్ రాథోడ్, మాలోతు రమేష్, ఆడావత్ రవి, ధరావత్ వినోద్‌లు హెడ్ కానిస్టేబుల్‌ను నెట్టి వేయడంతో పాటు విధులకు అటంకం కలిగించడంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ రామన్ గౌడ్ విచారణ చేసి చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖల్ చేశారు. వీరిపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికీ 3 వేల చొప్పున జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా కట్టని యెడల నెల రోజుల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీప రాణి వాదించారు. పీసీకి కోర్టు కానిస్టేబుల్ జానకి రాయ్ సహకరించారు.

శాసనసభను సందర్శించిన ఎన్జీ కళాశాల విద్యార్థులు



శాసన మండలి వద్ద ఎన్జీ కళాశాల విద్యార్థులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బీఏ విద్యార్థులు రాష్ట్ర శాసన సభ, శాసన మండలి ప్రత్యక్ష సమావేశాలను బుధవారం వీక్షించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, అధ్యాపకులు యాదగిరిరెడ్డి, వేణు, దీపిక, మల్లేశం పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం



మిర్యాలగూడలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



దేవరకొండ ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్ ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానికంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మూడావత్ జగన్‌నాయక్, ఆకాష్, లోకేష్, ఆనంద్, అఖిల్, సాయి, ఈశ్వర్, శ్రీకాంత్, నగేష్, పండు తదితరులున్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

దేవరకొండ : రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 6.57శాతం నిధులు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. అరకొర బడ్జెట్‌తో విద్యారంగం పూర్తిగా కుంటుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాహుల్, చందు, శ్రవణ్, అనిల్, రాజు, రవి, మనోహర్ తదితరులున్నారు.

నిమ్మల రాములుకు నివాళి

నాగార్జునసాగర్ : బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి మాజీ ఎమ్మెల్యే నిమ్మల రాములు ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం నిమ్మలరాములు వర్ధంతిని పురస్కరించుకుని విజయవిహార్ ఆవరణలో ఏర్పాటు చేసిన రాములు విగ్రహానికి ఆయన కుమారుడు నరేందర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ణబ్రహ్మానందరెడ్డి, వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణయ్య, శ్రీనివాస్, రాకేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండలంలోని కామరెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోగుల నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్ రెడ్డి బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. వారిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

దేవరకొండ : మండల పరిధిలోని పాత్లావత్ తండా(పి)కి చెందిన వాంకుడావత్ రవి చేపల వేటకు వెళ్లి మంగళవారం చెరువులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌కు చెందిన కార్పొరేటర్ నీలారవినాయక్ బుధవారం తండాకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆమె వెంట బాణావత్ రవికుమార్ తదితరులున్నారు.

పాములపహాడ్‌లో..

మిర్యాలగూడ : మాడ్గులపల్లి మండలంలోని పాములపహాడ్ గ్రామానికి చెందిన కుర్రి రాజు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ యాతం లక్ష్మీ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు చింతకాయల సైదులు, జానయ్య, ఈదయ్య, సతీష్, వేముల సందీప్ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు

మిర్యాలగూడ : మాడ్గులపల్లి మండలంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందిలో ముగ్గురికి మిర్యాలగూడ కోర్టు జైలు శిక్ష విధించింది. మాడ్గులపల్లికి చెందిన తాందార్‌పల్లి శ్రీనివాస్, చెర్వుపల్లికి చెందిన ఉప్పు వెంకన్నలకు మూడు రోజులు జైలు శిక్ష, హాలియాకు చెందిన సయ్యదర్ రఫికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మిగతా 15మందికి రూ.15,400 జరిమానా విధించినట్లు చెప్పారు.

'ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి'



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం నర్సాపురం గ్రామంలో నిర్వహించిన సీసీ రోడ్ల నిర్మాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేయడం సరికాదని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్, యువజన ఉపాధ్యక్షుడు ఎర్రమల్ల దినేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని గుర్తు చేస్తూ ఎమ్మెల్యే అన్న మాటలను ప్రతిపక్షాలు వక్రీకరించి ప్రచారం చేయడం తగదన్నారు. సమావేశంలో మహేష్‌నాయుడు, శ్రీనాథ్, బాచి కిరణ్, అంజియాదవ్, శివనాయక్, దత్తు నాయక్, జీవన్, నాగభూషణం, ఫయాజ్, శ్రీను, అభినవ్, రమేష్, సంపత్, వెంకట్, చంటి, హరి, సందీప్, నాగరాజు, కిట్టు, అరుణ్, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ వాసులకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం నర్సాపురం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, వెంటనే ఎమ్మెల్యే మిర్యాలగూడ వాసులకు క్షమాపణ చెప్పాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి డిమాండ్ చేశారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వేసిన రోడ్ల మీద ఎవరూ నడవద్దని, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు ఎవరూ తీసుకోవద్దని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రజలు కట్టిన పన్నుల ద్వారా ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ఎందుకు తీసుకోవద్దని ప్రశ్నించారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజలను బెదిరించే ధోరణిని మానుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ బంటు కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాలం వెంకన్న, సిద్ధునాయక్, సదానందం, దుర్గాప్రసాద్, మోహన్‌రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వాలు

పెద్దవూర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు కేటాయించిన బడ్జెట్ పూర్తిగా బీసీ వ్యతిరేక బడ్జెట్ అని బీసీ యువజన సంఘం జిల్లా అధికార ప్రతినిధి బొడ్డు వెంకట్ విమర్శించారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ యువజన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన బెజవాడ అనిల్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మంజుల రామదాసు, మేకల శివకుమార్, అరవింద్‌గౌడ్, విజయ్, పండు పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేష్

డిండి: జాతీయ చేనేత ఐక్య వేదిక యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా డిండి మండల కేంద్రానికి చెందిన గుర్రం సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు వేణుగోపాలాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు బంధు నిధులు విడుదల చేయాలి

నల్లగొండ టౌన్ : జిల్లాలో మిగిలిపోయిన రైతులకు రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి హైదరాబాద్‌లో జిల్లా సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 4,70,636 మంది రైతులకు రూ.555.78 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయని, ఇంకా మిగిలిన 8 వేల మంది రైతులకు రూ. 39 కోట్లు జమ కావాల్సి ఉందన్నారు.

ఆమనగల్లు ఆలయ చైర్మన్‌గా శ్రీను

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని ఆమనగల్లు గ్రామంలో శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన మద్దెబోయిన శ్రీనును బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వల్లంపట్ల వెంకన్న, ఉత్తెర్ల శ్రీనివాస్, సుధాకర్, మల్లయ్య, ప్రవీణ్, గురువయ్య, నాగయ్య, యాదయ్య, బాలస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి

మిర్యాలగూడ అర్బన్: అవంతీపురం సబ్‌స్టేషన్ నుంచి పరిసర గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. త్రీ ఫేజ్ కరెంట్ రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్రీఫేజ్ కరెంట్ ఇవ్వకుంటే డీఈ కార్యాలయం ఎదుట రైతులతో కలసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

క్లుప్తంగా

లెవీ త్వరగా పూర్తి చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న మాచన

కొండమల్లేపల్లి : లెవీ బియ్యం ఎగుమతిని సకాలంలో పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండలంలోని చెన్నారం వద్ద రైస్ మిల్లును ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లెవీని పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం మిల్లింగ్ అయిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

దేవరకొండ : మైనర్ల డ్రైవింగ్‌పై దేవరకొండలో బుధవారం సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లకు పోలీసులు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు 34 మందికి జరిమానాలు విధించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ సతీష్ తదితరులున్నారు.

గంగమ్మ గుడికి విరాళం



నగదు అందజేస్తున్న రంజిత్ యాదవ్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని బోయగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీగంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్ యాదవ్ రూ. 50వేల విరాళాన్ని బుధవారం ఆలయ పూజారి(పెద్దగొల్ల) మెండె సైదులు యాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ యాదవ్‌ను వారు సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చల్ల కోటేష్, రావుల కొండలు, మండల శ్రీనివాస్, పగడాల గంగరాజు, చల్లా మురళి, కాలసాని భిక్షం తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి ఎస్ఐగా వీరబాబు



కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ఎస్ఐగా వీరబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన నారాయణరెడ్డి వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వీరబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

పోటీ పరీక్షలపై భయాన్ని వీడాలి



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వీరయ్య

మిర్యాలగూడ టౌన్ : పోటీ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలపై ఉండే భయాన్ని వీడాలని రచయిత ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో సమాచార హక్కు చట్టం-2005 సాధన స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు చిలుముల కొండల్ ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 4తో పాటు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నెల్లూరుకు చెందిన ఫ్యాకల్టీతో ఉచిత డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఎకనామికల్ అధ్యాపకుడు మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్ రాజు, డివిజన్ ఉపాధ్యక్షులు మచ్చ మధుకర్, నాగరాజు, నరేష్ తదితరులున్నారు.

రెండో రోజు 10వేల మంది భక్తుల రాక

పెద్దవూర : మండలంలోని రామన్నగూడెం తండా వద్ద నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన కొలువై ఉన్న సుంకిశాల ముత్యాలమ్మ జాతరకు రెండవ రోజు బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 10వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి లచ్చీరాంనాయక్, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌నాయక్‌లు పూజలు చేశారు.

కొనసాగుతున్న జాతర

పెద్దవూర : మండలంలోని పొట్టిచెల్మ క్రాస్ రోడ్డు వద్ద కృష్ణానది సమీపంలో కొలువై ఉన్న వనదేవతలు సమ్మక్క–సారలమ్మ జాతర కొనసాగుతోంది. మహిళలు బుధవారం వనదేవతల గద్దెల సమీపంలో ఉన్న పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.